జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 6 | నవంబర్ | 2024 ◆ పేజీలు : 8

## ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండరాదు

**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 5, ప్రజాజ్యోతి**

వానాకాలం ధాన్యం కొనుగోల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ ఐఏఎస్ ఆదేశించారు, మంగళవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ తో పాటు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక అధికారి

మిగతా 2లో...





- చిన్న పిల్లలకు ఫోన్ ఉంటేనే ముద్ద దిగేనా..?
- పిల్లలకు వ్యసనంగా మారిన ఫోన్..!
- ఫోన్, ట్యాబ్ వాడకంలో మునిగి తేలుతున్న బాలలు..!
- ముమ్మాటికీ తల్లిదండ్రులే కారణమా..?
- ఆట బొమ్మలకు బదులు సెల్ ఫోన్ ఇస్తున్న వైనం
- వినికిడి శక్తి పై ప్రభావం చూపుతుంది అంటున్న వైద్యులు..!
- పిల్లల తల్లిదండ్రుల్లో మార్పు తప్పనిసరి..

8లో..



# సెల్ ఫోన్ తో... బాల్యం బందీ..!

ప్రస్తుత ఆధునిక యుగంలో గజిబిజి జీవితాలలో ఎవరికి వారే... యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగరీత్యా, వృత్తిరీత్యా, కుటుంబ వ్యవహారంలో బిజీగా ఉండి చిన్న పిల్లలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అప్పట్లో పిల్లలు అందరూ సరదాగా కలిసి వీరి వీరి గుమ్మడి పండు, అష్టా చమ్మా, కైలాసం, తొక్కుడు బిల్లా, దాగుడు మూతలు ఇలా చాలా ఆటలు సరదాగా ఆడుతూ, నానమ్మ, తాతయ్య ఒడిలో కబుర్లు... కథలు వినేవారు. చందమామ రావే... జాబిల్లి రావే... కొండెక్కి రావే... గోగుపూలు తేవే... అంటూ గతంలో చిన్నారులకు గోరుముద్దలు తినిపించే వారు. అమ్మ లాలన... ప్రేమ అక్కడి నుండే అనుబంధంగా మారుతుంది. కానీ నేటితరం పిల్లలకు ఇవన్నీ పూర్తిగా దూరమయ్యాయి. నేడు ఆ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిపోయాయి. పిల్లలు అంతా టెక్నాలజీ తోనే స్నేహం చేస్తున్నారు. పుట్టి పుట్టగానే చిన్నారి చేతిలో సెల్ ఫోన్ పెడుతున్నారు. పైగా మావాడు ఫోన్ లేకపోతే అన్నం ముట్టుకోవడం లేదంటూ అదేదో గర్వంగా చెబుతుంటారు. తల్లిపాల కోసం ఏడవాల్సిన చిన్నారి చివరకు సెల్ ఫోన్ ను దూరం చేయగానే ఏడుస్తున్నాడు. ఇటువంటి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ఎన్నో ఉన్నాయి. పిల్లలు సెల్ ఫోన్ వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వీలైనంతవరకు పిల్లలకు సెల్ ఫోన్ దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. తల్లిదండ్రులలో పూర్తిగా మార్పు రావాలి.

◆ ఇల్లందు, ప్రజాజ్యోతి

## సహజ వనరులతో, మట్టితో అందమైన బొమ్మరిల్లు కట్టుకోవచ్చు

-ఇంటి నిర్మాణాల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



2లో...

## అధికార లాంఛనాలతో జవాన్ అంతిమ వీడ్కోలు



- మృతదేహంపై జాతీయ జెండా కప్పిన జవాన్లు
- పెద్దఎత్తున తరలివచ్చిన జనం



**భద్రాచలం, నవంబర్ 5, ప్రజాజ్యోతి :**

ఏనుగుల దాడిలో అస్సాం రాష్ట్రంలోని ఆర్మీ క్యాంపు పరిసరాల్లో మృతి చెందిన జవాన్ కొంగా సాయి చందర్ రావు అంతి వీడ్కోలు అధికార లాంఛనాలతో మంగళవారం భద్రాచలంలో జరిగింది. మృతదేహాన్ని అస్సాం నుండి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ కు తరలించిన ఆర్మీ అధికారులు అక్కడ నుంచి

మిగతా 2లో...

# అధికార లాంఛనాలతో జవాన్ అంతిమ వీడ్కోలు



(మొదటి పేజీ తరువాయి...)

అంబులెన్స్ లో స్వగ్రామమైన భద్రాచలంకు తీసుకొచ్చారు. తొలుత అస్సాంలో మృతదేహానికి నివాళ్లు అర్పించిన ఆర్మి సిబ్బంది లాంఛనంగా విమానం వరకు విడ్కోలు పలికారు. అనంతరం హైదరాబాద్ లోని శంషాబాద్ విమానాశ్రయంలో వద్ద సైతం ఆర్మీ సిబ్బంది మృతదేహానికి నివాళ్లుర్పించి పుష్పాంజలి ఘటించారు. సాయిచందర్ మృతదేహం భద్రాచలం చేరుకున్న విషయాన్ని తెలుసుకున్న కుటుంబీకులు, బంధుమిత్రులు తండోప తండాలుగా తరలివచ్చి సంతాపం ప్రకటించారు. అస్సాం, హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాల నుండి కూడా వివిధ హోదాల్లో విధులు నిర్వహించే ఆర్మీ జవాన్లు భద్రాచలం చేరుకుని ఆర్మీ వస్త్రధారణతో అంతి వందన సమర్పించి మృత దేహంపై జాతీయ జెండాను కప్పారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న సిఎస్ఐ చర్చీ బరియల్ గ్రౌండ్ క్రైస్తవ సాంప్రదాయ పద్ధతుల్లో ఖననం చేశారు. ఈ సందర్భంగా ఇంటి నుండి బస్టాండ్ బరియల్ గ్రౌండ్ వరకు అంతి యాత్ర ఘనంగా సాగింది. మృతదేహాన్ని ఖననం చేసే క్రమంలో అప్పటికే కప్పి ఉంచిన జాతీయ జెండాను గౌరవంగా తొలగించిన జవాన్లు సాయి చందర్ రావు భార్యకు దానిని అప్పగించారు. ఆమె జెండాను అందుకుని గుండెలకు హత్తుకుని రోదిస్తున్న తీరును చూసిన కుటుంబీకులు, బంధుమిత్రులు, స్థానికులు బోరున విలపించారు. దేశరక్షణ సేవలో ఉన్న చందర్ రావు తన కుటుంబానికి జాతీయ జెండాను అందించి వెళ్లిపోయారని కన్నీరు మున్నీరయ్యారు. విధుల్లో నిబద్ధత గల జవాన్ గా పేరున్న అతను అందరితో కలివిడిగా, స్నేహ పూర్వకంగా మెలిగే వాడని, మానవసంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే జవాన్ చిన్న వయస్సులోనే కాలం చేయడం బాధాకరమని, ఆ కుటుంబానికి తీరనిలోటని అస్సాం ఆర్మీ క్యాంపు నుండి వచ్చిన జవాన్ రెహమాన్ తో పాటు పలువురు జవాన్లు అన్నారు. అతనితో ఉన్న సాన్నిహిత్య సంబంధంతో అస్సాం నుండి కూడా ఆర్మీ కుటుంబాలు తరలివచ్చాయి. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి ఉంది. జావాన్ మృతి వార్త తెలుసుకున్న భద్రాచలం సీఐ సంజీవ రావుతో పాటు ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళ్లర్పించి అంతిమ వీడ్కోలులో పాల్గొన్నారు.

## ఘనంగా నాగులచవితి వేడుకలు

*అశ్వారావు పేట, నవంబర్ 5, ప్రజాజ్యోతి:*



సృష్టిలోని ప్రతిజీవిలో దైవన్ని చూడమనేది హైందవ సంస్కృతి జీవన విధానంలో అది ముఖ్య భాగం. కార్తీక మాసంలో దీపావళి పండగ తర్వాత వచ్చే ఐదవ రోజు అనగా చతుర్థి తిథిని నాగులచవితిగా భావించి నాగులకు పూజ చేస్తారు. అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న నాగుల చవితి పండగను నియోజకవర్గ వ్యాప్తంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. పుట్టలో పాలు పోసి నాగేంద్రుడిని భక్తితో తమను ఎల్లవేళలా కాపాడుతూ, దైవం వెడల భక్తిశ్రద్ధలతో ఉండాలే ఆశీస్సులు అందించాలని వేడుకుంటున్నారు. పుట్టల దగ్గరకు వెళ్లిన భక్తులు ప్రత్యేక పూజలను చేసి పాలు పోసి చలిమిడి, నువ్వులతో చేసిన చిమ్మిలిని నైవేద్యంగా సమర్పించుకున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

*భద్రాచలం టౌన్, నవంబర్ 5, ప్రజాజ్యోతి*



ఎటపాక 132కేవీ సబ్ స్టేషన్ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ జీవన్ కుమార్ తెలియజేశారు. చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలలో విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం కలుగుతుందని అన్నారు . వినియోగదారులు అందరూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోడ్ తగ్గించుకుని విద్యుత్ వాడుకోవాలని కోరారు

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండరాదు

(మొదటి పేజీ తరువాయి...)

సురేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ వానాకాల సీజన్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చివరి గింజ వరకు నాణ్యమైన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో డబ్బులు చెల్లించాలన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తుందన్నారు, జిల్లాలో ధాన్యం కొనుగోలుకు తీసుకుంటున్న చర్యలను కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు, తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టరాదని అధికారులకు సూచించారు, ధాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే అధికారులు పై చర్యలు తప్పమన్నారు , అనంతరం జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు, జిల్లాలో రెండు లక్షల 95 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనాతో 165 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు, అవసరాన్ని బట్టి అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పనకు ఏ బి గ్రేడ్ రకాలుగా విభజించి మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు, ఏ గ్రేడ్ ధాన్యం 23 20, బి గ్రేడ్ రకం 2300, రూపాయలుగా మద్దతు నిర్ణయించినట్లు తెలిపారు, ప్రతిరోజు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓ పి ఎం ఎస్ లో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు, ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన గ్రైన్ ఖాళీ వర్డ్స్ కార్పోలిస్, తేమ యంత్రాలు , వేయింగ్ యంత్రాలు, , గన్ని బ్యాగులు తదితర సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా రు, వాతావరణ శాఖ సూచనల పాటిస్తూ రైతులకు సమాచారం అందించాలన్నారు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నవోడ్లు, దొడ్డు వడ్లకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు, ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు ఫరీదా గజన తరలించాలన్నారు, అనంతరం 2024 వానాకాలం సీజన్ ధాన్యము మద్దతు ధరకు సంబంధించిన గోడపత్రికను జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ ఆవిష్కరించారు, ఈ సమావేశంలో డిసిఎంఎస్ చైర్మన్ కొత్తవల శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనం, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి, మేనేజర్ త్రినాథ్ బాబు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సహజ వనరులతో , మట్టితో అందమైన బొమ్మరిల్లు కట్టుకోవచ్చు

**–ఇంటి నిర్మాణాల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్**

*భద్రాచలం, నవంబర్ 5 ప్రజాజ్యోతి:*



సేంద్రీయ ఎరువులతో పంటలు పండించుకొని అధిక దిగుబడులు ఎలా సాధిస్తామో గ్రామాల్లో మనం జీవించడానికి పదికాలాల పాటు సురక్షితంగా ఉండేలా ఇంటి నిర్మాణ విషయంలో ప్రత్యేక సహజ వనరులతో గ్రామంలో మట్టితో అందమైన బొమ్మరిల్లు వంటి ఇల్లు నిర్మించుకోవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలో వైటీసీలో మట్టితో సాంప్రదాయ కట్టడాలు, గ్రామీణ ప్రాంతాలల్లో తక్కువ ఖర్చుతో, పర్యావరణానికి అనుకూలంగా మంచి మన్నిక కలిగిన నిర్మాణాలపై రమ్మిడి ఎర్త్ ఫౌండేషన్, సీఎస్బీ పద్ధతులతో అవసరమైన ఇంటి నిర్మాణాల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి మాట్లాడారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గిరిజనులు ఆచార వ్యవహారాలు, సంస్కృతీ ,సాంప్రదాయాలతో పాటు ఇంటి నిర్మాణాలు కూడా పాతకాలపు కట్టడాలు తక్కువ పెట్టుబడితో పర్యావరణానికి హాని కలిగించకుండా మట్టితో అందమైన నివాసగృహాలు నిర్మించుకుని జీవనాధారం ఎటువంటి అనారోగ్యాలు దరిచేరకుండా పదికాలాల పాటు జీవించవచ్చన్నారు. మట్టితో తయారుచేసిన ఇళ్లు, టాయిలెట్లు, మరుగుదొడ్లు, అంగన్వాడీ సెంటర్లు ప్రతిదీ కూడా ఇష్టమైన పద్ధతిలో మన నిర్మించుకోవచ్చని. వీటి నిర్మాణానికి అంత ఖర్చు కూడా ఉండదన్నారు. సహజంగా ప్రతి గ్రామంలో చెరువులు, వాగులు, సెలయేళ్ల పరిసరాల్లో రకరకాల రాళ్లు లభ్యమవుతాయని, పంట పొలాల్లో కావాల్సిన మట్టి దొరుకుతుందని, దీంతో కావాల్సిన సైజులో ఇటుకలు తయారుచేసుకుని వెదురు కర్రలతో అవసరమైన రీతిలో అందమైన ఇంటి నిర్మాణాలు తక్కువ ఖర్చు, సమయంలో పూర్తిచేసుకోవచ్చన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, చత్తీస్గఢ్, మహారాష్ట్రలో ఎక్కువ శాతం ఇండ్లు మట్టితో కట్టినవే మనకు దర్శనమిస్తాయన్నారు. వీటి వల్ల అన్నికాలాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తద్వారా ఎలాంటి రుగ్మతలు దరిచేరవన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే సిమెంటు, ఇసుక వంటి వాటిని తగ్గించి గ్రామంలో సహజం దొరికే మట్టి, రాళ్లు కలిపి సమపాళ్లలో ఇటుకలు తయారుచేసుకుని తక్కువ పెట్టుబడితో పాఠశాలల్లో ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్స్, అంగన్వాడీ సెంటర్లు, జీపీఎస్ పాఠశాలల్లో నిర్మాణాలు చేపట్టడానికి ఈ శిక్షణ ఆదివాసీ గిరజనులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ రెండు రోజుల శిక్షణను శ్రద్ధగా విని తెలుసుకుని గ్రామాల్లో అమలుచేయాలని సూచించారు. అనంతరం ఇటుకలు ఏవిధంగా తయారుచేయాలో ప్రాక్టికల్గా శిక్షణకు వచ్చిన వారితో కలెక్టర్, పీవోల సమక్షంలో తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ విద్యాచందన, సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, జేడిఎం. హరికృష్ణ శిక్షకుడు సుధాకర్, వివిధ మండలాల నుంచి ఏఈలు, డీఈలు, టీచర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎన్ఆర్జీఎస్, ఐకేపీ ఏపీఎంలు, తాపీమేస్త్రీలు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

# పార్టీని నష్టపరిస్తే సహించేది లేదు

**బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పార్టీ నుంచి బహిష్కరణ..**
**మోరంపూడి అప్పారావు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు**

**నన్ను సస్పెండ్ చేసే అధికారం వారికి లేదు.. గుంట్రు కృష్ణ.. బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు**

*ములకలపల్లి, నవంబర్ 05, (ప్రజాజ్యోతి ):*



అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మండల బీఆర్ఎస్వీ అధ్యక్షునిగా పనిచేస్తున్న గుంట్రు కృష్ణను పార్టీ నుంచి బహిష్కరించడంతో పాటు బిఆర్ఎస్వీ మండల విభాగాన్ని రద్దు చేస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్వి మండల అధ్యక్షుడు గుంట్రు కృష్ణ పార్టీకి నష్టం చేకూర్చేలా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతూ పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. పార్టీలో పదిమంది లేరు అంటూ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా, పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నట్లు వివరించారు. అధికార పార్టీ నాయకులకు టచ్ లో ఉంటూ కార్యకర్తల్లో చీలకలు తెచ్చేలా పోస్టులు పెడుతున్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా బీఆర్ఎస్వీ మండల నాయకత్వాన్ని రద్దు చేసి పార్టీ నుంచి గుంట్రు కృష్ణను సస్పెండ్ చేయాలని ఆదేశించడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మోరంపూడి తెలిపారు.

**పార్టీ నుంచి బహిష్కరించే అధికారం మండల, జిల్లా కమిటీలకు లేదు**

**బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గుంట్రూ కృష్ణ**

బీఆర్ ఎస్వీ మండల విభాగాన్ని రద్దు చేసి పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసే అధికారం మండల, జిల్లా కమిటీలకు లేదని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గుంట్రూ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సోషల్ మీడియా లో తనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పోస్టు లు రావడం పై స్పందించిన కృష్ణ బీఆర్ఎస్ పార్టీలో వలస వాదుల పెత్తనం ఎక్కువైందని, వారి వల్లే ఉద్యమ నాయకులు పార్టీలో ఇమడలేక పార్టీని విడుతున్న పరిస్థితి వచ్చిందన్నారు. వలస వాదులతోనే ఉద్యమ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పార్టీ గెలుపు కోసం పార్టీలో కి వచ్చిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఒగ్గేల పూజ, భూక్యా ప్రసాద్ లకు ఏపాటి గౌరవం ఇస్తూన్నారో కార్యకర్తలకు తెలుసన్నారు. అసలు అశ్వారావు పేట నియోజకవర్గ ఇంచార్జి నియమకమే జరగలేదని ఎవరికి వారు ఇంచార్జి అని ప్రకటన చేసుకోని ఇష్టానుసారంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఓ కార్యకర్తనే సస్పెండ్ చేసే అధికారం మండల, జిల్లా కమిటీకి లేదని, అలాంటిది తనను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ప్రకటన ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



# నూతన కమిషనర్ ను కలసిన కొత్వాల, కాంగ్రెస్ నాయకులు



**పాల్వంచ, నవంబర్ 05, ప్రజాజ్యోతి :**

పాల్వంచ పురపాలక సంఘం నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన కె. సుజాత ను డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస రావు నాయకత్వంలో పాల్వంచ కాంగ్రెస్ నాయకులు కలసి అభినందించారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ని శాలువా బొకేలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్వంచ మాజీ జడ్పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, ఎల్డీఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్, కాల్వ భాస్కర రావు, ఎస్వీఆర్కే ఆచార్యులు, కనగాల నారాయణరావు, బాలినేని నాగేశ్వర రావు, చింత నాగరాజు, వై వెంకటేశ్వర్లు, ఎస్ కె చాంద్ పాషా, దారా చిరంజీవి, కాపర్తి వెంకటాచారి, వాసు మల్ల సుందర్రావు, శనగ రామచందర్ రావు, మస్నా శ్రీనివాస్, పులి సత్యనారాయణ, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతి వర్ధన్, శ్రీలతారెడ్డి, అరుణ రెడ్డి, వేమ రాంబాబు, పాకలపాటి రోశయ్య చౌదరి, సందు ప్రభాకర్, చెరుకుపల్లి సూర్య కిరణ్, గంధం నరసింహారావు, సోము లగూడెం నాగేశ్వరరావు, ఎస్. కె భాషా, ప్రశాంత్ కాలనీ రెడ్డి పాల్గొన్నారు.

# టిడిపి పార్లమెంట్ ఆడహాక్ కమిటీ సభ్యుడిగా ముద్రగడ



**ఇల్లందు, నవంబర్ 5, ప్రజాజ్యోతి:**

తెలుగుదేశం పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అడహాక్ కమిటీ సభ్యునిగా ఇల్లందు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ ముద్రగడ వంశీని నియమించారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో టిడిపి పార్టీ బలోపేతం కోసం పార్లమెంట్ పూర్తి స్థాయి అడహాక్ కమిటీని ఎన్నుకున్నట్టు ఆ పార్టీ పోలీస్ బ్యూరో సభ్యులు జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024– 26 సంవత్సరానికి గాను పార్టీ బలోపేతం కోసం సభ్యత నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పూర్తి స్థాయి అడహాక్ కమిటీ నియమిస్తున్నట్లు తెలిపారు. అడహాక్ కమిటీ కన్వీనర్ గా కొండపల్లి రామచంద్ర రావు, కమిటీ సభ్యులుగా 19 మందిని నియమించడం జరిగిందని, ఇల్లందు నుండి ముద్రగడ వంశీని నియమిస్తున్నట్టు పేర్కొన్నారు. ముద్రగడ వంశీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని, ఇల్లందు నియోజకవర్గంలో అందరి సహకారంతో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం. చేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం రూ. 100 పెట్టి తీసుకున్న సభ్యులకు రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్లమెంట్ అడక్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు నారా చంద్రబాబునాయుడు, బక్కరి నరసింహులు, కొండపల్లి రామచంద్ర రావులకు కృతజ్ఞతలు తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ టిడిపి అర్హత కమిటీ సభ్యులుగా ఎన్నికైన ముద్రగడ వంశీని నాయకులు పాలమాలు బాల కృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చందావత్ రమేష్ బాబు, కారు నర్సన్న, శ్యామ్ తీవారి, గోపాల కృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# కులగణన సర్వేలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలి

## – పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు పిలుపు



**పాల్వంచ, నవంబర్ 05, ప్రజాజ్యోతి :**

కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఆశయాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 6వ తారీకు నుండి చేపట్టే కులగణన సర్వేలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు రూపుమాపాలని, రానున్న రోజుల్లో చట్ట సభల్లో జనాబా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం ఉండాలన్న రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా చేపట్టే ఈ సర్వేలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని, దీనికి పట్టణ, మండల కాంగ్రెస్ కార్యకర్తలు సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది అయితా గంగాధర్, బట్టు మురళి నాయక్, ఎల్డీఎం కోర్డినేటర్ బద్ది కిషోర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెంకి శ్రీనివాస్ రావు, రూరల్ ఓబీసీ అధ్యక్షుడు కట్టా సోమయ్య, పట్టణ ఓబీసీ అధ్యక్షులు చారి, రాము నాయక్, మైనారిటీ నాయకులు చాంద్, ఇమ్మానుయేల్, సాంబయ్య యూత్ కాంగ్రెస్ నాయకులు ఆనంద్, కాంగ్రెస్ సోషల్ మీడియా కోర్డినేటర్ షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

**భద్రాచలం టౌన్, నవంబర్ 5, ప్రజాజ్యోతి**

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం భద్రాచలం సబ్ ట్రెజరీ అధికారి కార్యాలయం ఎదుట ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు, కె ఎస్ ఎల్ వి ప్రసాద్, చల్లగుల్ల నాగేశ్వర రావు ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన మెమోరాండమును ఏ టి ఓ విష్ణురావు, ఎస్ టి ఓ టి సుభద్ర కు అందజేసి మెమోరాండంను తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి పంపించవలసినదిగా కోరారు. ధర్నాను ఉద్దేశించి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెండింగులో ఉన్న అన్ని రకాల ఏరియర్స్ బిల్లులను వెంటనే చెల్లించాలని. పి ఆర్ సి రిపోర్టును తెప్పించుకొని వెంటనే పిఆర్సిని అమలు చేయాలన్నారు. కోర్టుకు పోయిన వారికే కాకుండా జనరలైజ్ చేసి కోర్టుకు పోని వారికి కూడా వర్తింపచేయాలన్నారు. కమ్యూటేషన్ వాల్యు ఆఫ్ పెన్షన్ ని 15 సంవత్సరాలు కాకుండా 12 సంవత్సరాలకు రీస్టోర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నాయకులు కొత్తగూడెం జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు డెక్క నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ విజయ్ హాజరై సత్వరమే సమస్యలు పరిష్కరించాలన్నారు. **ధర్నాకి ముందు పెన్షనర్ల భారీ ప్రదర్శన ....** ముందుగా ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ నాయకులు సుబ్బయ్య చౌదరి, రాజబాబు, విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, టీవీ చలం, దీకొండ వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, తదితరుల నాయకత్వంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పెన్షనర్ల యొక్క సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులు చేత పట్టి నినదించారు. ఈశ్వరమ్మ, అన్నపూర్ణాదేవి, సుందర నవమని, చంద్రావతి, ఉమాదేవి, వీ రంగయ్య, తదితర పెన్షనర్ల నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా నాగులచవితి వేడుకలు



**అశ్వాపురం, నవంబరు 5, ప్రజా జ్యోతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలో గౌతమ్ నగర్ కాలనీ లో ఘనంగా నాగుల చవితి వేడుకలు . ఈ కార్యక్రమంలో భక్తులు ఉపవాసం ఉండి ఆవుపాలతో, తీర్థాలతో, పండ్లు, పూలు నాగులమ్మ పుట్ట దగ్గర అమ్మవారికి సమర్పించి మమ్మల్ని కాపాడే తల్లివి నీవే నాగమ్మ మా కష్టాల నుంచి మమ్ములను కాపాడే తల్లివి నీవే కోరుతూ మొక్కుబడులను చెల్లించుకున్న భక్తులు ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొనీ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలుచేసినారు. మా కష్టాల నుంచి మమ్ములను కాపాడే తల్లివి నీవే కోరుతూ మొక్కుబడులను చెల్లించుకున్న భక్తులు వేలాదిమంది భక్తులు పాల్గొనీ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలుచేసినారు. నాగుల చవితి ప్రధానంగా ఉపవాసాల పండుగ ఈరోజు భక్తులు ఉపవాసాలు ఉండి ఉదయాన్నే పుట్టలో పాలు పోసి, చలిమిడి, చమిడి వంటి పదార్థాలు నాగదేవతకు సమర్పించి అనంతరం ఆరోజు మొత్తం భక్తులు భక్తి శ్రద్ధలతో ఉపవాసంతో, ఉంటారు, వేడి చేసిన పదార్థాలను తినరు. దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి అంటారు. నాగుల చవితి విశిష్టత ఏమిటంటే మానవ శరీరంలో నిద్రిస్తున్నట్లు నటిస్తూ, కామ, క్రోధ, లోభ, మోహ, మెద, మాత్సర్యాలతో విషం కక్కుతూ మానవునిలో సద్గుణ, సంపత్తిని, ఆరించి వేస్తూ నాగుల చవితి రోజున విష సర్ప పుట్టలను ఆరాధించి పుట్టలలో పాలు పోస్తే మానవునిలో ఉండే విషం కూడా హరించుకుపోతుందని ఆంతర్యం.

# 24న పద్మశాలి కార్తీక సమారాధన



**ఇల్లందు, నవంబర్ 5, ప్రజాజ్యోతి:** ఈనెల 24న రొంపేడు చెక్ పోస్ట్ వద్ద గల మామిడి తోటలో పద్మశాలి కార్తిక సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పద్మశాలి సంఘ అధ్యక్షుడు గోచికొండ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక జగదాంబ సెంటర్ లోని ఆ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశాలి కార్తీక సమారాధన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్ తో పాటు ప్రముఖ నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. పద్మశాలి కులస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు సిరిమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దోమల మహేశ్వర్, గౌరవ సలహాదారుడు ఊరుగొండ ధనుంజయ్, కోశాధికారి సిరిమల్ల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు సిరిమల్ల నాగరాజు, జోగు సతీష్, కమిటీ సభ్యులు వేముల వెంకట నర్సు, కర్నాటి వెంకటరాజు, గోచికొండ ఈశ్వర్, వలుపదాసు రాజేష్, రాహుల్ నేత, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భక్తిశ్రద్ధలతో నాగులచవితి

**టేకులపల్లి, నవంబర్05, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నాగులచవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. కోదండ రామాలయం ప్రాంగణంలో ఉన్న పాముల పుట్టల వద్ద మహిళల ప్రత్యేక పూజలు చేసి, నాగేంద్రుడికి పాలు పోసి, స్వామికి పూజలు చేసి ఫలితంగా తమ కుటుంబాలను చల్లంగా చూడాలని నాగేంద్రుడిని మొక్కుకున్నారు. అనంతరం చిన్నపిల్లలకు పుట్ట వద్ద చెవులు కుట్టించే కార్యక్రమలు, నాగదేవతకు, నాగరాజుకు పూలు, పండ్లు, కోడిగుడ్లు, బియ్యంతో తయారు చేసే చలివిడి వివిధ నైవేద్యములను నాగదేవతలకు నైవేద్యంగా సమర్పించారు. పుట్ట వద్ద మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



# ఘనంగా భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

## – పుట్టలో పాలు పోసిన కొత్వాల దంపతులు



**పాల్వంచ రూరల్, నవంబర్ 05, ప్రజాజ్యోతి:** నాగుల చవితి సందర్భంగా పాత పాల్వంచలో డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి విమలాదేవి దంపతులు పుట్టలో పాలు పోసి, పూజలు చేశారు. పాత పాల్వంచ షిరిడి సాయిబాబా దేవాలయం ప్రాంగణంలోని నాగేంద్ర స్వామి దేవాలయంలో మంగళవారం నాగుల చవితి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో కొత్వాల తోపాటు వందలాదిమంది మహిళలు, భక్తులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లోగాని సత్యనారాయణ, శిరిడి సాయిబాబా దేవాలయం నిర్వాహకులు, ముత్యాల కోటేశ్వరరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఆటో కార్మికులకు రూ.15,000 చెల్లించాలి



**భద్రాచలం టౌన్, నవంబర్ 5, ప్రజాజ్యోతి:** ఆటో కార్మికులకు 15000 వేల భృతిని ప్రకటించాలని భద్రాచలం ఆర్టీసీ అవుట్ గేట్ ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేసారు .మంగళవారం రాష్ట్రవ్యాప్త ఆటో కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు పూర్తిగా నష్టపోయారని,మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికులు దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు ప్రయాణికులు కేవలం ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారని, దింతో ఆటో కార్మికులకు కిరాయిలు లేక అవస్థలుపడుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సుప్రయాణం తో కొంత మంది ఆటో కార్మికులు జీవనం గడవక ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని అన్నారు .ప్రభుత్వం ఆటో కార్మికులకు నెలకు రూ.15వేల భృతి చెల్లించాలన్నారు. ఆత్మహత్య చేసుకొని మరణించిన ఆటో కార్మికులకు 10 లక్షల రూపాయల ఎక్స్రేషియా ప్రకటించాలని ఆర్టీసీ అవుట్ గేట్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ అజీమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎస్సి వర్గీకరణ విజయోత్సవ సభను జయప్రదం చేయండి

**ఇల్లందు, నవంబర్ 5, ప్రజాజ్యోతి:** నేడు కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్ వద్ద గల ఉర్దూ ఘర్ లో జరగనున్న ఎస్సి వర్గీకరణ విజయోత్సవ సభకు మాదిగ, మాదిగ ఉప కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టియంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు, దళిత రత్న మేకల శ్యామ్ మాదిగ కోరారు. మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ విజయోత్సవ సభకు ముఖ్య అతిథులుగా టియంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సి వర్గీకరణ ఉద్యమనేత, మాదిగ / మాదిగ ఉపకులాల అగ్రనేత ఇటుక రాజు మాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టియంఆర్పిఎస్ ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షుడు బోశాల దుర్గారావు మాదిగ, టియంఆర్పిఎస్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు రాచపల్లి చంద్రశేఖర్ మాదిగ, టియంఆర్పిఎస్ మాదిగ యువసేన జిల్లా అధ్యక్షులు తాళ్ల శివ మాదిగ, టియంఆర్పిఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



**ఇల్లందు, నవంబర్ 5, ప్రజాజ్యోతి:** మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన శ్రీరామ్ రమేష్ ఇంట్లో దీపావళి రోజున కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి, సుమారుగా రూ. 3 లక్షల నగదుతో పాటు గృహోపకరణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. జడ్పిఎస్ఎస్ ZPSS కొమరారం పాఠశాలలో వారి కుమారుడు ఎస్.సాయి చరణ్ 10వ తరగతి చదువుతుండడంతో ఆ కుటుంబానికి జరిగిన నష్టాన్ని పూడ్చడం కోసం ఉడతా భక్తిగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు కలిసి రూ. 17 వేల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులందరికీ ఆ గ్రామ పెద్దలు, ఆ కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

# అమరజీవి కామ్రేడ్ బత్తుల భీష్మారావుకు ఘన నివాళి

## ...సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు



**భద్రాచలం టౌన్, నవంబర్ 5, ప్రజాజ్యోతి:** ప్రజా పోరాటాలు, వర్గ పోరాటాలు నిర్మించడమే అమరజీవీ కామ్రేడ్ బత్తుల భీష్మారావుకు మనమిచ్చే ఘన నివాళి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు . కామ్రేడ్ బత్తుల భీష్మారావు 39వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన భద్రాచలం సిపిఎం పార్టీ కార్యాలయం నందు నిర్వహించరు . ముందుగా కామ్రేడ్ భీష్మారావు చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భద్రాచలం ఉమ్మడి నియోజకవర్గంలో పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించరన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మాజీ వార్డు మెంబర్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ అనేకమంది అమరవీరుల రక్త తర్పణతో భద్రాచలం డివిజన్ సిపిఎం ఉద్యమం నిర్మితమైందని, అమరవీరుల ఆశయాలను పునికి పుచ్చుకొని సిపిఎం ఉద్యమాన్ని నిలబెట్టుకోవడం, బలోపేతం చేసుకోవడమే వారికి మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, కే బ్రహ్మచారి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు, పట్టణ కమిటీ సభ్యులు డి సీతాలక్ష్మి, యు జ్యోతి, నకిరికంటి నాగరాజు, ఎ . రత్నం, సీనియర్ నాయకులు ఎం.వి.ఎస్ నారాయణ, భూపేంద్ర, కోరాడ శ్రీనివాస్, కుంజా శ్రీనివాస్, అజయ్ కుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కుల గణన సర్వేకు కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలి

## – రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల



**పాల్వంచ, నవంబర్ 05, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేకు కాంగ్రెస్ కార్యకర్తలు అధికారులకు సహకరించాలని డీసీఎంఎస్ చైర్మన్ రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. పాల్వంచ పరిధిలోని అయ్యప్ప నగర్ లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్వాల మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుండి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టనున్నదని, కుటుంబ యజమానితో పాటు వారి కుటుంబ సభ్యుల వివరాలు అధికారులు సేకరిస్తారన్నారు. ఈ సమగ్ర సర్వేలో యజమాని కులం, వృత్తి, వయస్సు, వ్యాపారం, ఉద్యోగం, నివాస ప్రాంతం, వంటి 75 అంశాలతో నిర్వహిస్తారన్నారు. ఈ సర్వే లోనే కులగనన సర్వే కూడా జరుగుతుందన్నారు. ఈ సర్వే అనంతరం కార్డులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్డు వలననే ప్రభుత్వం ఇచ్చే పథకాల పంపిణీ ఆధారపడి ఉన్నందున అందరూ ఈ సర్వేలో పాల్గొనాలని కొత్వాల అన్నారు. పట్టణాల్లో మండలాల్లో చేపట్టే సమగ్ర సర్వేక కార్యక్రమానికి కుటుంబ యజమానులతో పాటు ప్రజలు అధికారులు సహకరించాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు తమ ప్రాంతాల్లో అధికారులు చేపట్టే సర్వే వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి సర్వేలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి యర్రం శెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణరావు, కాంగ్రెస్ నాయకులు ఎస్ వి ఆర్ కె ఆచార్యులు, చింత నాగరాజు, కాపర్తి వెంకటాచారి, వై వెంకటేశ్వర్లు, దారా చిరంజీవి, ఎస్.కె చాంద్ పాషా, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతి వర్ధన్, వాసు మల్ల సుందర్రావు, సూర్య కిరణ్, అజిత్, శనగ రామచందర్, మస్నా శ్రీనివాసరావు, పాబోలు నాగేశ్వరరావు, ఎస్ కే భాషా, బాలకృష్ణ, సీనియర్ అడ్వకేట్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ బస్తీలో నాకబంధీ




**ఇల్లందు, నవంబర్ 5, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలోని బస్తి బోరింగ్ తండాలో మంగళవారం ఇల్లందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాకబంధీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను మాట్లాడుతూ సైబర్ నేరాలు పైన అప్రమత్తంగా ఉండాలని, పేస్ బుక్, ట్విట్టర్ లలో వచ్చే మెసేజ్ లు, మెయిల్ లకు ఆన్సర్ ఇవ్వవద్దని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గంజాయి, గుట్కా, మత్తు పదార్థాల జోలికి పోవద్దని, యువత పెడదారిన పడవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ లేకుండా ఎవరు కూడా ప్రయాణించవద్దని, ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబం రోడ్డున పడుతుందని, జీవనోపాధి కోల్పోతారని తెలిపారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాల రవాణా, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇచ్చిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామని, వారికి తగిన ప్రోత్సాహకం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సిఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు నాగుల్ మీరా సందీప్, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి పాటుపడే వారికే మద్దతు నివ్వండి

## ఉపాధ్యాయుల విధిగా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి.



**జూలూరుపాడు :నవంబర్ 5,ప్రజా జ్యోతి**

మార్చి లో జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ MLC ఎన్నికలలో విద్య వైద్య రంగాల అభివృద్ధికి పాటుపడే వారికి ఓటు వేయాలని ఎ.పి. యు.ఎస్ & టి.పి.యు.ఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ దండా మురళీధర్ రెడ్డి కోరారు.మంగళవారం రోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్స్ ను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడు, సుజాతనగర్,ఉపాధ్యాయులను కలిసి ఉపాధ్యాయ MLC ఓటు నమోదు చేసుకోవలసిందిగా వారు కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్ లైన్లో కానీ ఆఫ్ లైన్లో కానీ దరఖాస్తు చేసుకొనుటకు దరఖాస్తు ఫామ్.19 తో పాటు ప్రిన్సిపాల్ సంతకం చేసిన సర్వీస్ సర్టిఫికెట్ కాపీ,ఓటరు ఐడి,ఆధార్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫొటో ఉండాలన్నారు. 2019లో ఉన్న ఓటర్ జాబితా పూర్తిగా రద్దయినందున ప్రతి ఒక్కరూ మళ్ళీ నమోదు చేసుకోవాల్సిందేనని వారి కోరారు.ఎమ్మెల్సీ ఓటు నమోదుకు రేపు ఒక్క రోజు మాత్రమే గడువు ఉన్నదని వెంటనే నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత మార్చి నుండి ఉద్యోగవిరమణ పొందిన వారు కూడా తమ ఓటును నమోదు చేసుకోవాలని అన్నారు.ప్రస్తుతం విద్యారంగ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల, ఆచార్యుల సమస్యలు, మెడికల్ కళాశాలల సమస్యలు పరిష్కరించ బడాలంటే, ప్రభుత్వ పాఠశాలలు, విద్యాలయాలు కాపాడ బడాలంటే విద్యారంగ అభివృద్ధికి పాటుబడే జాతీయవాదులకు అండగా నిలిచి కౌన్సిల్ కు పంపాలని ఉపాధ్యాయులను వారు కోరారు.టిపియుఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు డి. సురేష్, ప్రధానకార్యదర్శి బి. కృష్ణ, మాజీ అధ్యక్షులు శివరామ కృష్ణ, పాండురంగాచారి,ప్రిన్సిపాల్స్,అధ్యాపకులు, ఆచార్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కుల గణన సర్వేలో మున్నూరుకాపులు అందరూ నమోదు చేసుకోవాలి

**ఇల్లందు, నవంబర్ 5, ప్రజాజ్యోతి:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణన సర్వే నేటి నుంచి ప్రారంభం కానున్నందున మున్నూరుకాపు కులస్తులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు పింగళి నరేష్ కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నమోదులో పలు ముఖ్య సూచనలు పాటించాలన్నారు. కుల గణన సర్వే చేసే ఎన్యుమరేటర్ వచ్చినప్పుడు సర్వేలోని 6వ ప్రశ్న (పాయింట్ ) కు మన సామాజిక వర్గం బీసీ అని చెప్పాలని, ఈ 6వ ప్రశ్నకు క్రింద సమాధానం రాసే గడి (బాక్స్) లో దీని కోడ్ 03 అని రాయాలని సూచించారు. అదేవిదంగా 7వ ప్రశ్నకు మన కులం పేరు కేవలం మున్నూరుకాపు కులం అని మాత్రమే చెప్పాలని, ఈ 7వ ప్రశ్నకు కింద సమాధానం రాసే గడి (బాక్స్) లో దీని కోడ్ – 098 అని రాయాలన్నారు. 8వ ప్రశ్నకు కులం యొక్క ఇతర పేర్లు (ఉంటే) – అనేదానికి అటువంటివి ఏమి లేవు అని చెప్పాలని, ఈ 8వ ప్రశ్నకు క్రింద సమాధానం రాసే గడి (బాక్స్) లో డ్యాష్ ( __ ) రాసి ఉండాలని కోరారు. ఖచ్చితంగా ప్రత్యేకంగా మున్నూరుకాపు అని ఒత్తి పలికి చెప్పాలని, అలా కాకుండా కేవలం కాపు అని చెప్పినట్లు ఐతే మనం ఓసి ( అధర్ క్యాస్ట్) – 04 కింద ఆంధ్ర కాపుగా 007 కోడ్ లో తప్పుగా నమోదు అవుతామని పేర్కొన్నారు. చివరగా మనలో దక్షిణ తెలంగాణలో కొంత మంది బయట తెలగ అని పిలవబడుతారని,



సర్టిఫికెట్ మున్నూరు కాపు ఉన్నా కానీ సహజంగా అదే తెలగ అని పిలవ బడుతారని, అలా చెప్పినట్లైతే ఒకటి తెనుగు, ముదిరాజు, లేదా రెండు ఆంధ్ర లోని తెలగ, కాపు, నాయుడు గా భావించవచ్చని తెలిపారు. మున్నూరు కాపులు జాగ్రతలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సర్వే మొత్తం రాసిన తర్వాత ఇంటి పెద్దగా మనం సంతకం చేసేటప్పుడైన మళ్ళీ ఒకసారి ఈ విషయాలు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది సరిచూసుకోవాలని కోరారు.

# ప్రగతిశీల భావజాల వ్యాప్తోద్యమాలను ఉధృతం చేద్దాం

## –మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకుందాం: ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి







**ఇల్లందు, నవంబర్ 5, ప్రజాజ్యోతి:**

ప్రగతిశీల భావజాల వ్యాప్తోద్యమాలను ఉధృతం చేద్దామని, మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకుందామని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు.మంగళవారం పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ప్రమాదకరంగా మారుతున్న కుల, మతోన్మాద ఫాసిజన్ని అడ్డుకునేందుకు విద్యార్థులంతా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ప్రగతిశీల భావజాల వ్యాప్తోద్యమాలను ఉధృతం చేయాలని కోరారు. భూమి, భుక్తి, విముక్తి కోసం, కులం, మతం, దోపిడీ, పీడన, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ సమాజం స్థాపన కోసం పోరాడుతూ అమరులైన వీరుల ప్రాణత్యాగాలు వెలకట్ట లేనివన్నారు. విప్లవకారులు మరణించినప్పటికీ వ్యవస్థ మార్పు కోసం జరిగే పోరాటాల్లో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని తెలిపారు. 78 సంవత్సరాల భారత పార్లమెంటరీ పాలన ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయిందని, దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, అరికట్టలేక పోయారని, ప్రజలకు కనీసం అంతరాలు లేని ఉచిత విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతూ దళిత, గిరిజన, బడుగు, బలహీన పేద వర్గాలను విద్యారంగానికి దూరం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచారు కానీ పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల మాటేమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థి అమరవీరుల పోరాటస్ఫూర్తితో నేటి విద్యార్థులు ఉద్యమించి శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజాన్ని స్థాపించుకోవాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. పూర్వ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల అశోక్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ డా. గుమ్మడి అనురాధ, పిఓడబ్ల్యు మాజీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు నాయిని రాజు, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, పి.వై.ఎల్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ అజయ్, ఎ.ఐ.పి.కె.ఎస్. జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న పి.డి.ఎస్.యు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కంపాటి పృథ్వి, పి.డి.ఎస్.యు జిల్లా నాయకులు బానోత్ నరేందర్, మునిగేల శివ, పార్థసారథి, ఎనగంటి వంశీ, గంగాధర గణేష్, వంశీ పాల్గొన్నారు.



# అక్రమ టేకు కలప స్వాదీనం పరుచుకున్న అధికారులు



**చర్ల, నవంబర్5, ప్రజా జ్యోతి :**

చర్ల మండలంలోని పలు గ్రామాలలో కార్పెంటర్ల స్థావరాలపై చర్ల అటవీశాఖ రేంజ్ అదికారి గగులోత్ ద్వాలియా ఆద్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి ,భారీగా అక్రమ టేకు కలపను స్వాదీనం చేసుకున్నారు. కార్పెంటర్లు పర్మిట్ టేకు కలప పేరుతో అడవుల నుండి అక్రమంగా తీసుకు వచ్చి ఫర్నీచర్ తయారు చేస్తున్నారని పిర్యాదులు రావడంతో దాడులను నిర్వహించామని అధికారులు తెలిపారు.సత్యనారాయణపురం,కొత్తపల్లి గ్రామాలలోని కార్పెంటర్ల కార్ఖానాలపై దాడులు నిర్వహించి రూ. 1,15,000 విలువ చేసే అక్రమ టేకు దిమ్మెలను స్వాదీనం చేసుకొని చర్ల అటవీశాఖ కార్యాలయంకు తరలించారు. అక్రమ టేకుకలప తీసుకొచ్చి, పర్మిట్ ఉందని ప్రజలను నమ్మించి మోసం చేస్తే సహించేది లేదని అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల కార్యక్రమంలో తేగడ సెక్షన్ డిఆర్వో కృష్ణ, చర్ల డి ఆర్ వో హచ్చ్యా, ఎఫ్ ఎస్ వో లు బాల కృష్ణ, జైసింగ్, ఎఫ్ బి వో లు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవు :ఎస్సై గంజి స్వప్న



**చంద్రుగొండ, నవంబర్ 5, ప్రజాజ్యోతి:**

ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గంజి స్వప్న హెచ్చరించారు. మంగళవారం వ్యవసాయ కూలీలు ,ఆటో డ్రైవర్లతో ఆమె మాట్లాడుతూ కూలీలు సైతం ఆటోలో పరిమితికి మించి ఎక్కకూడదని ఎటువంటి ప్రమాదం జరిగిన అది కుటుంబాలలో తీవ్ర అగాధాన్ని నింపుతుందన్నారు. ఆటో డ్రైవర్లు సైతం పరిమితికి మించి కూలీలను ఎక్కించుకోవద్దన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణించటం వలన జరిగే నష్టాలను తెలియజేశారు. అటువంటి ఆటో డ్రైవర్ల పై జరీమానాలు విధించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నిజాయతీని చాటుకున్న కరుకు ప్రసాద్




**ద్రాచలం టౌన్, నవంబర్ 5,ప్రజాజ్యోతి :**

తనకు దొరికిన ఫోన్ ను బాధితురాలికి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు కరుకు ప్రసాద్ .గోదావరి కట్ట వద్ద తనకు దొరికిన విషయాన్నీ స్థానిక యస్ఐ విజయలక్ష్మి చేతులమీదుగా బాధితురాలికి అందజేశారు . ఈ సందర్భంగా ఎస్సె విజయలక్ష్మి మాట్లాడుతూ ఎవరిదైనా మొబైల్ ఫోన్ పోయినట్లయితే పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చినట్లయితే దానిని పోలీసుల వెబ్ సైట్ సిఈఐఆర్ పోస్టల్ ద్వారా ఫోను టాప్ చేసి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న భాదితులకు అందజేస్తామని అన్నారు.

## ఉత్తమ సొసైటీగా గుంపెన సహకార సంఘం



**చంద్రుగొండ, నవంబర్ 5, ప్రజా జ్యోతి:**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన సహకార సంఘం ను ఉత్తమ సొసైటీగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ సీఈవో చేతుల మీదుగా సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్ రావు ప్రశంసా పత్రాన్ని, షీల్డ్ ను అందుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

### : మండల భాజపా అధ్యక్షుడు భోగి కృష్ణయ్య



**చంద్రుగొండ, నవంబర్ 5, ప్రజా జ్యోతి:**

ఇందిరమ్మ పిల్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలని బిజెపి చంద్రుగొండ మండల అధ్యక్షుడు భోగి కృష్ణయ్య తెలిపారు. ఇటీవల ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారని వారి ద్వారా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక చేయవద్దని కోరారు. ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆ విధంగా లబ్ధిదారులను ఎంపిక చేయవద్దని డిమాండ్ చేశారు.

## ఆదివాసుల హక్కుల పోరాటం సమితి మహాసభలు

### తుడుందెబ్బ నూతన కమిటీ ఎన్నిక

**టేకులపల్లి, నవంబర్05, ప్రజాజ్యోతి:**

టేకులపల్లి మండల కేంద్రంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలో మహాసభలు నిర్వహించారు. మంగళవారం జరిగిన మండలం మహాసభలకు ముఖ్య అతిథులుగా రమణాల లక్ష్మయ్య తుడుందెబ్బ జాతీయ కన్వీనర్, తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంపిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వట్టం కన్నయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పూనెం బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి దుగ్గరాపు వీరభద్రం, ఇల్లందు మండల అధ్యక్షులు సువర్ణపాక రామారావు హాజరయ్యారు. రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ ఆగస్టు 01, 2024న దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ఎస్టీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్టి వర్గీకరణను జరపాలని ఆయన అన్నారు. ఈ ఎస్టీ వర్గీకరణ జనాభా ధమాషా ప్రకారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిషన్ను నియమించి, ఎస్టీ తెగలలో మొత్తం ఎన్ని తెగలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయ్ అభివృద్ధి చెందని తెగలు ఎన్ని ఉన్నాయి. అని ఒక కమిషన్ రిపోర్ట్ తీసుకొని దాని ఆధారంగా ఎస్టీ వర్గీకరణ జరపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా టేకులపల్లి మండలంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా తాటి రవికుమార్, ప్రధాన కార్యదర్శి పాయం శ్రీను, మండల ఉపాధ్యక్షులుగా గొగ్గల అశోక్, జోగ భరత్, బిజ్జా కిరణ్, సహాయ కార్యదర్శిగా మోకాళ్ళ సునీల్, కోశాధికారిగా జోగ వంశీ, ప్రచార కార్యదర్శులుగా నాగేంద్ర బీజ్జా శ్రీకాంత్, సలహాదారుగా మూతి వెంకన్న మండల కార్యవర్గంలోకి 21 మంది సభ్యులను ఎన్నుకున్నారు.



# శిక్షణలో తర్ఫీదు పొంది జీవనోపాధి పెంచుకోవాలి

### –టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, పీవో

**భద్రాచలం, నవంబర్ 5, ప్రజాజ్యోతి:**

నిరుద్యోగ గిరిజన యువతులు స్వయం ఉపాధి కోసం అందిస్తున్న కుట్టు శిక్షణలో తర్ఫీదు పొంది జీవనోపాధి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి వైటీసీలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కుట్టుశిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణలో అందుతున్న సౌకర్యాలను గిరిజన యువతులను అడిగి తెలుసుకున్నారు. పై చదువులు చదివి ఇంటి వద్దే ఖాళీగా ఉండకుండా జీవనోపాధికి సంబంధించి ఇలాంటి శిక్షణలు తీసుకుని తమ కుటుంబాలను పోషించుకోవాలన్నారు. గిరిజన యువకులకు గత నెల 26 నుంచి ఈనెల 26వ తేదీవరకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణను అందించడం జరుగుతుందని, శిక్షణా సమయంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం టూల్ కిట్ తో పాటు ఆయా బ్యాంకు శాఖలకు ముద్ర లోన్ కోసం సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే ఈ శిక్షణలో 35 మంది యువతులు చాలా చక్కగా తర్ఫీదు తీసుకుంటున్నారని కలెక్టర్, పీవోలకు రీసెట్స్ శిక్షణా సంస్థ



డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ , కోర్సు కోఆర్డినేటర్ వహీద్ పాషా , ట్రైనర్ విద్యావతిలు పాల్గొన్నారు.

## బీఎస్ఆర్ దంపతులకు ఉపాధ్యాయులు, విద్యార్థుల అభినందన



**బూర్గంపహాడ్, నవంబర్ 5 ప్రజా జ్యోతి:**

గాడ్ సన్ హోలిస్పిరిట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్ను సారపాకకు చెందిన బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బీఎస్ఆర్ సోమవారం హైదరాబాద్లో అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బీఎస్ఆర్ దంపతులను పాఠశాల, కళాశాల ఉపాధ్యాయ, అధ్యాపకులు, విద్యార్థులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. 2023-2024లో ప్రతిష్టాత్మక ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు, 2024-25లో ఉత్తమ ఉపాధ్యాయునిగా గురుబ్రహ్మ అవార్డు, జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా బంగారు నంది అవార్డులను బీఎస్ఆర్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, పాఠశాల అధ్యాపక, ఉపాధ్యాయులు నలజాల సత్యనారాయణ, విష్ణుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్మికుల కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయండి

### సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ జె రమేష్

**భద్రాచలం, నవంబర్ 5, ప్రజాజ్యోతి:**

గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 12వ తేదీన జరిగే కలెక్టరేట్ ధర్నా లో ప్రతి పంచాయతీ కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంపీ నర్సారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కాపుల రవి అధ్యక్షతన జరిగిన పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ జె రమేష్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డిలు మాట్లాడుతూ... గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించకుండా వాయిదా వేసిందన్నారు . ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పట్ల నిమ్మక నీరెత్తినట్టుగా ప్రభుత్వం ఉందని అన్నారు .ఎన్నికల ముందు జరిగిన 34 రోజుల నిరవధిక దీక్షలో పాల్గొన్న ఆనాటి కాంగ్రెస్ నాయకులు నేటి ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి మేము అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికుల సమస్యలన్నీ సమగ్రంగా పరిశీలిస్తామని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు .12న జరిగే జిల్లా కలెక్టర్ ధర్నాను జయప్రదం చేయాలని అలాగే ఈ నెల 12వ తేదీన ములుగులో మంత్రి సీతక్క ఇంటి ముందు జరిగే ధర్నాను కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు .ప్రధానంగా కార్మికుల కనీస వేతనం 26,000 అమలు కావటం లేదని పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యం అందరికీ కల్పించబడటం లేదని ,అర్హులైన వారిని పర్మినెంట్ చేస్తామని పని భద్రత కల్పిస్తామని ,మల్టీపర్పస్ డ్యూటీలు ఎత్తివేస్తామని అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు .దీన్ని నిరసిస్తూ జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి గ్రామపంచాయతీ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణే మా ధ్యేయం : 2009 బ్యాచ్ పోలీసులు

### – 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్



**పాల్వంచ, నవంబర్ 05, ప్రజాజ్యోతి:**

అంకిత భావంతో విధి నిర్వహణ చేపడుతూ.. పోలీస్ శాఖకే వన్నె తెచ్చి, ఔరా అనిపించారు. 2009లో పోలీస్ శాఖలో ప్రవేశించి, అలుపెరగని యోధులుగా ముద్ర వేసుకున్నారా రక్షకబటులు. సర్వీస్ లో 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని మంగళవారం 16వ సంవత్సరంలోకి అడిగిన సందర్భంగా పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ లో ఎస్సైతో కేక్ కట్ చేయించారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. గ్రామీణ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న తేజావత్ నాగేశ్వరరావు, దుబ్బ ప్రసాదరావు, విజయ్ కుమార్, మోహన్ బాబు లు 2009 బ్యాచ్ పోలీసులు. పలు స్టేషన్లలో విధులు చేపట్టి, ప్రజా మన్ననలు పొందారు. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణలో నేటి మేటిగా నిలిచారు. ప్రస్తుతం ఈ నలుగురు గ్రామీణ పోలీస్ స్టేషన్ లో విధులు కొనసాగిస్తున్నారు. ఎస్సై సురేష్ ద్వారా కేక్ కట్ చేయించి, ఒకరికొకరు అలింగణం చేసుకున్నారు. ఒత్తిడిని అధిగమించి, అంకుఠిత దీక్షతో ప్రజా సేవలో నిమగ్నమవుతామని ప్రతిన బూనారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, ఎస్ హెచ్ ఓ సూచనల మేరకు విధులు చేపడతామని స్పష్టం చేశారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు -ఎస్సై రాజేష్



**బూర్గంపహాడ్, ప్రజా జ్యోతి, నవంబర్ 5:**

మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనదారులపై కఠినచర్యలు తీసుకుంటామని బూర్గంపహాడ్ ఎస్సై రాజేష్ హెచ్చరించారు. మంగళవారం పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో వాహన తనిఖీలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. వచ్చి పోయే వాహనాలను ఆపి లైసెన్స్ తో పాటు అన్ని వాహనపత్రాలు ఉన్నాయా లేవా తనిఖీ చేశారు. చలానాలు పెండింగ్ ఉంటే వెంటనే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, వాహన నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అలా నడిపి కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని అలా వాహనాలు పిల్లలకు ఇవ్వద్దని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని యువతను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫారెస్టు, విద్యుత్ శాఖల సహకారంతో పంట భూముల్లో విద్యుత్ సౌకర్యం

**–ఐటీడీఏ పీవో రాహుల్**



**భద్రాచలం, నవంబర్ 5 ప్రజాజ్యోతి:**

మారుమూల ప్రాంతాల్లో నివసించే గిరిజన రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారని, వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవడానికి పంట భూముల్లో కరెంటు సౌకర్యం కల్పిస్తే రెండు పంటలు పండించుకోవచ్చని ఇందుకు ఫారెస్టు, విద్యుత్శాఖల సమన్వయం, సహకారంతో విద్యుత్ సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు .మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఫారెస్టు, విద్యుత్ అధికారులతో ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పోడు పట్టా కలిగిన రైతుల వ్యవసాయ భూముల్లో విద్యుత్ మోటార్లకు కరెంటు సౌకర్యం కల్పించడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజన రైతులకు ఆర్వోఎస్ఆర్ ద్వారా వ్యవసాయ భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు అధికంగా వస్తున్నందున విద్యుత్, ఫారెస్టు శాఖలు సమన్వయంతో పంట పొలాల్లోనే రైతుల సమక్షంలో జాయింట్ సర్వే చేసి ఎవరికి ఇబ్బందులు కలగకుండా గిరిజన రైతులకు కరెంటు సౌకర్యం కల్పిస్తే సమస్య ఉండదని సర్వే సమయంలో నిష్ణాతులైన ఫారెస్టు, విద్యుత్ సిబ్బందిని పంపి పకడ్బందీగా సర్వే చేపట్టాలని సూచించారు. గిరిజన రైతులకు కరెంటు మోటార్లు సబ్సిడీపై ఇవ్వడానికి ఎన్జీవోలు ముందుకు వస్తున్నారని, రైతుల సమస్యలు పరిష్కరించేలా ఆ రెండు శాఖలు సమన్వయంతో కృషిచేయాలన్నారు ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్రాజ్. డీటీఆర్వోఎస్ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో పవర్ ఏఈ మునీర్బాషా, ఎస్ఆర్వోలు, డిఎఫోవోలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గూగులోత్ ధర్మ చిత్రపటానికి నివాళులు



**జూలూరుపాడు, నవంబర్ 5 (ప్రజా జ్యోతి)**

గిరిజనసంఘం వ్యవస్థాపక నాయకులు, సిపిఎం ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు గుగులోత్ ధర్మ నాయక్ మొదటి వర్ధంతి సందర్భంగా జూలూరుపాడు మండలానికి చెందిన సి.పి.ఎం. పార్టీ కార్యకర్తలు ధర్మనాయక్ అభిమానులు ఖమ్మం లోని భక్తరామదాసు కళ క్షేత్రం లో జరుగుతున్నా గిరిజన సమ్మేళనం పాల్గొని ధర్మ నాయక్ చిత్రా పటానికి నివాళులు అర్పిస్తున్న జూలూరుపాడు మండలం గుండేపూడి గ్రామ నాయకులు భానోత్ మధు, ఇస్లావత్ భద్రు భూక్యా సురేష్, బోడ లక్ష్మ వల్ల మల్ల చందర్ రావు, కనక రత్నం, దానయ్య శాంతి, బురి, భవ్‌సింగ్, చంటి, నాగరాజు, సాయి కుమార్, రమణయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడాకారులను అభినందించిన ఐటీడీఏ పీవో



**భద్రాచలం, నవంబర్ 5, ప్రజాజ్యోతి:**

భద్రాచలం ప్రభుత్వ కళాశాల, పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు మడకం శ్రీవిద్య 800మీటర్లు లాంగ్ జంప్, ఎస్కె అఫ్రీన్ షాట్ పుట్, బిపృథ్వీక 600మీటర్ల లాంగ్ జంప్ లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చినందుకు మంగళవారం తన ఛాంబర్ లో క్రీడాకారులను ఐటీడీఏ పీవో రాహుల్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వీరు ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్ లో డిసెంబర్ లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించాలని వారికి శాలువాలతో ఘన సత్కారం చేసి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. క్రీడాకారులకు ఐటీడీఏ తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా కారుల కోచ్ గిరిప్రసాద్, పూనెం కృష్ణ, ముర్ల రమేష్‌రెడ్డి , పాయం రాజేంద్రప్రసాద్ లు పాల్గొన్నారు

# ఘనంగా నాగుల చవితి వేడుకలు



**బూర్గంపహాడ్, నవంబర్ 5, ప్రజా జ్యోతి:**

బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా నాగులచవితి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి సమీపంలోని శివాలయాలు, పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రస్వామికి పాలు పోసి నైవేద్యంగా నువ్వులు, కోడిగుడ్లు, సలివిడి తదితర వాటిని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని బూర్గంపహాడ్, సారపాక, లక్ష్మీపురం, మోరంపల్లిబంజర్, అంజనాపురం, తాళ్లగొమ్మూరు, కోయగూడెం, ఇరవెండి, మోతేపట్టీనగర్ తదితర గ్రామాల్లో మహిళలు పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నాగులచవితి ఘనంగా జరుపుకున్నారు.

# శ్రీరామ యంత్రానికి భద్రాద్రిలో పూజలు



**భద్రాచలం, నవంబర్ 5 ప్రజాజ్యోతి:**

రథంలో అయోధ్యకు తరలుతున్న శ్రీరాయ యంత్రానికి భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయంలో ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాయ యంత్రం రథం ద్వారా భద్రాచలానికి చేరుకోవడంతో ఆలయ సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో శ్రీరామయంత్రాన్ని ఆలయంలో స్వామివారి వద్ద ఉంచి శాస్త్రోకంగా అర్చకులు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం శ్రీరామ యంత్రాన్ని ఆలయ ఈవో ఆలయ సాంప్రదాయంతో తిరిగి రథం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి అక్కడ సమర్పించారు. కంచిపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా రథం అయోధ్యకు చేరుకునేందుకు తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో తిరుగుతూ భద్రాచలం చేరుకోగా ఈ పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి అయోధ్యకు శ్రీరామ రథం బయలుదేరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవోతో పాటు అర్చకులు, ఈఈ రవీందర్, ఏవో భవానీకృష్ణ, సూపరింటెండెంట్ సాయిబాబా, కంచిపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

# అమరవీరుల వర్ధంతి బహిరంగ సభను జయప్రదం చేయండి

**సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు**



**టేకులపల్లి, నవంబర్05, ప్రజాజ్యోతి:**

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉద్యమంలో చాలామంది మెరుపు కనికలాంటి నాయకులు, కార్యకర్తలు అమరులయ్యారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు హర్జ్య, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ అన్నారు. పెట్రాంచలక, తుమ్మల చేలక, బేతంపూడి గ్రామాలలో జరిగిన అమరవీరుల వర్ధంతి బహిరంగ సభకై ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడ్లుతూ మండల ప్రజా పరిషత్ వైస్ ప్రెసిడెంట్ చింతా లక్ష్మి, బేతంపూడి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ నోముల పరుశురాములు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు నంబూరి సీతారామారావు, సతీమణి పిఓడబ్ల్యు నాయకురాలు సుసేన, 80 సంవత్సరాల సీనియర్ గిరిజన నాయకుడు కోటన్నలను పట్టుకొని చిత్రహింసల పాలు చేసి కాల్చి చంపేసి పోలీసులు ఎన్కౌంటర్ కథ అల్లారని వారు ఆరోపించారు. ఈనెల 8వ తేదీన కాచనపల్లిలో అమరవీరుల బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నమని ఈ బహిరంగ సభకు మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు గుగులోతు రామచందర్, గుగులోతు చంధ్య, ఆంగోత్ బాలు, చింతా లాలమ్మ , ఈసం రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు .

# నిరుద్యోగ యువతి, యువకులకు కేఎల్ గ్రూపులో ఉద్యోగ అవకాశాలు



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి)**

డిగ్రీ , ఇంటర్, పదవ తరగతి చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు హైదరాబాదులోని మేడ్చెల్ లో గల కెఎల్ గ్రూపులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం విలేకరులకు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కే ఎల్ గ్రూపులో 250 ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ఇంటర్ డిగ్రీ పదవ తరగతి చదివిన నిరుద్యోగ యువకులకు అవకాశం కల్పిస్తూ ఈనెల 7న గురువారం జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ జాబ్ మేళా ఎండిఓ ఆఫీస్ రామాలయం టెంపుల్ బాబు క్యాంప్ కొత్తగూడెం నందు నిర్వహించినట్లుగా తెలిపారు, దరఖాస్తు చేసుకునే యువతీ యువకులు 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు కలిగి ఉండాలని తెలిపారు, దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు సర్టిఫికెట్లను జిరాక్స్ కాపీలతో తీసుకురావాలని కోరారు.

# సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి.. తాసిల్దార్ స్వాతి బిందు



**జూలూరుపాడు, నవంబర్ 5, ప్రజా జ్యోతి**

రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి ప్రారంభం కానున్న సమగ్ర కుటుంబ సర్వే జూలూరుపాడు మండల ప్రజలు సహకరించాలని తాసిల్దార్ స్వాతి బిందు కోరారు. మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో ఓ ప్రకటనలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటా సకుటుంబ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సర్వేలో భాగంగా ప్రజలు తమ యొక్క సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే తో పాటుగా రాజకీయపరంగా కూడా ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఈ సర్వేలో 73 మంది ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వేకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆమె వెల్లడించారు. సర్వేకు మండల ప్రజలు సహకరించాలని విధిగా తమ కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని ఎన్యుమరేటర్లకు అందించాలని తాసిల్దార్ కోరారు..



# సెల్ ఫోన్ తో... బాల్యం బందీ..!



**చిన్న పిల్లలకు ఫోన్ ఉంటేనే ముద్ద దిగేనా..?**

**పిల్లలకు వ్యసనంగా మారిన ఫోన్..!**

**ఫోన్, ట్యాబ్ వాడకంలో మునిగి తేలుతున్న బాలలు..!**

**ముమ్మాటికీ తల్లిదండ్రులే కారణమా..?**

**ఆట బొమ్మలకు బదులు సెల్ ఫోన్ ఇస్తున్న వైనం**

**వినికిడి శక్తి పై ప్రభావం చూపుతుంది అంటున్న వైద్యులు..!**

**పిల్లల తల్లిదండ్రుల్లో మార్పు తప్పనిసరి..**

ప్రస్తుత ఆధునిక యుగంలో గజిబిజి జీవితాలలో ఎవరికి వారే... యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగరీత్యా, వృత్తిరీత్యా, కుటుంబ వ్యవహారంలో బిజీగా ఉండి చిన్న పిల్లలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అప్పట్లో పిల్లలు అందరూ సరదాగా కలిసి వీరి వీరి గుమ్మడి పండు, అష్టా చమ్మా, కైలాసం, తొక్కుడు బిల్లా, దాగుడు మూతలు ఇలా చాలా ఆటలు సరదాగా ఆడుతూ, నానమ్మ, తాతయ్య ఒడిలో కబుర్లు... కథలు వినేవారు. చందమామ రావే... జాబిల్లి రావే... కొండెక్కి రావే... గోగుపూలు తేవే... అంటూ గతంలో చిన్నారులకు గోరుముద్దలు తినిపించే వారు. అమ్మ లాలన... ప్రేమ అక్కడి నుండే అనుబంధంగా మారుతుంది. కానీ నేటితరం పిల్లలకు ఇవన్నీ పూర్తిగా దూరమయ్యాయి. నేడు ఆ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిపోయాయి. పిల్లలు అంతా టెక్నాలజీ తోనే స్నేహం చేస్తున్నారు. పుట్టి పుట్టగానే చిన్నారి చేతిలో సెల్ ఫోన్ పెడుతున్నారు. పైగా మావాడు ఫోన్ లేకపోతే అన్నం ముట్టుకోవడం లేదంటూ అదేదో గర్వంగా చెబుతుంటారు. తల్లిపాల కోసం ఏడవాల్సిన చిన్నారి చివరకు సెల్ ఫోన్ ను దూరం చేయగానే ఏడుస్తున్నాడు. ఇటువంటి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ఎన్నో ఉన్నాయి. పిల్లలు సెల్ ఫోన్ వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వీలైనంతవరకు పిల్లలకు సెల్ ఫోన్ దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. తల్లిదండ్రులలో పూర్తిగా మార్పు రావాలి.



◆ ఇల్లందు, ప్రజాజ్యోతి

పుట్టినప్పటి నుండి అమ్మ సాంగత్యంలో మాటలు, నాన్న చేయి పట్టుకొని అడుగులు వేయటం నేర్చుకునే బాబు, పాప ఇప్పుడు తల్లిదండ్రులకు కాకుండా సెల్ ఫోన్ లకు దగ్గరవుతున్నారు. పిల్లవాడు ఏడిస్తే చాలు వాడు ఏది ఇస్తే ఏడుపు మానేస్తాడో అదే ఇస్తున్నారు. అదేంటో అందరికీ తెలిసిందే... సెల్ ఫోన్... పైగా మా అబ్బాయి ఫోన్ ఆఫ్ చేసి ఆన్ చేస్తాడు.. ఆటలు ఆడతాడు... మాకు కూడా చేతకాదు.. ఎన్ని తెలివితేటలు అంటూ తల్లిదండ్రులు తమ పిల్లల గురించి గొప్పగా చెబుతూ మోసపోతుంటారు. సోషల్ మీడియాతో ఎన్ని ప్రయోజనాలున్నాయో... దుష్ఫలితాలు అంతకుమించి ఉన్నాయనేది వాస్తవం. ఇప్పటికే అనేక సంస్థలు వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఈ మాధ్యమాల ఉచ్చులో బాల్యం బంధీ అవుతుంది. ఇదే పెద్ద ప్రమాదం అంటున్నారు నిపుణులు. ఐదేళ్ల లోపు చిన్నారులు సైతం సెల్ ఫోన్ అలవాటు పడడంతో మాటలు ఆలస్యానికి కారణాలుగా వీటిని నిర్ధారించారు. పుట్టినప్పుడు నుండి ఐదేళ్ల లోపు ప్రతి చినారులోనూ ఒక నిమిషానికి 7 న్యూరాన్లు ఒకదానికి ఒకటి సంబంధం ఏర్పరుచుకుంటున్నాయి. ఇది ఏర్పరచుకున్న సమయంలో అవి మెదడులో వీరికి శక్తికి, మాట్లాడడానికి అవసరమైన వాటిని అభివృద్ధి చేస్తాయి. ఈ ఐదేళ్ల లోపే అవి పెరిగే క్రమంలో అతడు చూస్తున్న దానిని గ్రహించాలని ప్రయత్నం చేస్తాడు. ఈ గ్రామంలో ఫోన్ ఇస్తే ఫోన్ లో వినబడే మాటలు వింటాడు. కానీ పెదాల కదలికలను గుర్తించలేడు. దీంతో వినికిడి శక్తి మామూలుగానే ఉంటుంది. దానిని మాటలుగా మార్చే ప్రక్రియ ఎదగదు.



## స్మార్ట్ సెల్ ఫోన్ లేనేది రోజు గడవదు

ఆధునిక సాంకేతిక యుగంలో స్మార్ట్ ఫోన్ అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషిస్తుంది. స్మార్ట్ ఫోన్ లేనిదే రోజు గడవదంటే అతిశయోక్తి కాదు. నిదుర లేచినప్పుటి, నిద్రకు ఉపక్రమించే వరకు ప్రక్కన స్మార్ట్ ఫోన్ ఉండాల్సిందే. సగం పనులు దీనితోనే అవుతున్నాయంటే మాటలు కాదు. ఒకవైపు స్మార్ట్ ఫోన్ తో ఎన్ని ఉపయోగాలున్నాయో.. అంతకుమించి సమస్యలు సైతం ఉన్నాయి. ముఖ్యంగా పిల్లలపై సెల్ ఫోన్ పెను ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం 99 శాతం మంది చేతుల్లో స్మార్ట్ ఫోన్ ఉంటుంది. చిన్నపిల్లలు ఈ ఫోన్ ల వల్ల అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని కొన్ని అధ్యయనాల్లో తేలింది.



## వినికిడి శక్తిపై ప్రభావం

జంతువుల నుండి మనుషులను వేరు చేస్తుంది కేవలం మాటే..! అదే మాటనే భాషగా మార్చుకొని మానవుడు ఎంతో ఎత్తుకు ఎదిగాడు. ఈమాటకు ప్రధాన కారణం వినికిడి శక్తి. ఈ వినికిడి శక్తి అనేది చిన్నారుల్లో ఐదేళ్ల లోపే పూర్తిస్థాయిలో ఏర్పడుతుంది. ఈ ఐదేళ్ల లో దీని ద్వారానే మాట వస్తుంది. అనేక లోపాల కారణంగా చిన్నారుల్లో వినికిడి శక్తి కోల్పోతున్నారు. కానీ అన్నీ ఉండి వినికిడి శక్తి సక్రమంగా ఉండి మా అబ్బాయికి ఐదేళ్లు వచ్చినా మాటలు రావడం లేదంటూ వైద్యుల వద్దకు ఇటీవల కాలంలో పదుల సంఖ్యలో తల్లిదండ్రులు వెళ్తున్నారు. వారిని అన్ని రకాలుగా పరీక్షించిన వైద్యులు ఏ లోపం లేదని వినికిడి శక్తి 100 శాతం సక్రమంగా ఉందని చెప్పి వారు కూడా మాటలు ఎందుకు రావడం లేదని దానికి కారణాలు వెతుకుతున్నట్లు తెలుస్తుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువమందికి ఈఎన్టి వైద్యుల వద్దకు వచ్చిన సమస్యలతో పరిశోధించిన శాస్త్రజ్ఞులు నిర్ధారించిన విషయం ఒకటే అదే స్మార్ట్ ఫోన్...

## బుద్ది మాంద్యానికి కారణం..

మాటలు ఆలస్యం అయినవారు భవిష్యత్తులో బుద్ధి మాంద్యానికి కూడా కారణం అవుతారని హెచ్చరిస్తున్నారు. అందువలన ఐదేళ్ల లోపు చిన్నారులకు ఎటువంటి స్మార్ట్ ఫోన్, వీడియో ప్లేయర్, కంప్యూటర్ చూసే అవకాశం ఇవ్వవద్దని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు రేడియో మాగ్నెటిక్ ఫ్రీక్వెన్సీ కారణంగా సెల్ ఫోన్ వింటే ఐదేళ్ల లోపు చిన్నారులలో క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయని, భవిష్యత్తులో కణితలు ఏర్పడుతాయని హెచ్చరిస్తున్నారు. కానీ అవన్నీ భవిష్యత్తులో వచ్చే ప్రమాదాలు. ప్రస్తుతం ఫోన్ తో ప్రమాదం ఇప్పటికప్పుడే పొంచి ఉంది.



## మెదడుపై ప్రభావం...

పిల్లవాడు సాధారణంగా ఏడు గంటలు మెలకువగా ఉంటాడు. అందులో భోజనానికి, స్నానానికి మూడు గంటలు పోయినా గ్రహణ శక్తి ఉండే సమయం 7 గంటలు. ఈ 7 గంటల్లో రెండు గంటలు టచ్ ఫోన్ ఇచ్చిన సాధారణంగా ఆడియో ప్రభావం కన్నా వీడియో ప్రభావం మెదడుపై ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఆ ఏడు గంటలకు కూడా దీని ప్రభావమే ఉండి చిన్నారి కొత్త విషయాన్ని మాట్లాడడానికి ప్రయత్నించడు. అదే మాటలు ఆలస్యం రావడానికి కారణమవుతుంది.

## గుర్తించడం ఎలా...!

చిన్నారి టచ్ ఫోన్ కు బానిస అయ్యాడని గుర్తించాలి. దీనికి ఒకటే మార్గం... పిల్లవాడి నుంచి ఫోన్ తీసుకోగానే అసాధారణ ప్రవర్తనకు దిగుతాడు. మామూలుగా పిల్లలు ఏడుస్తారు.. కానీ ఈ లక్షణాలు ఉన్నవారు తల గోడకేసి కొట్టుకోవడం, చేతితో బలంగా గోడను కొట్టినటువంటి అసాధారణ ప్రవర్తనకు వెళ్తాడు. కారణం వీడియో చూపే ప్రభావం. వీటిని గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

## స్పీచ్ థేరపిస్ట్ శిక్షణ...

ప్రస్తుతం మన సమాజంలో 40 శాతం మంది చిన్నారులు ఐదేళ్లలోపే టచ్ ఫోన్ చూస్తున్నారు. వీరిలో కనీసం 10 నుండి 20 శాతం మంది వినికిడి లోపం సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనాకు వచ్చారు. అందువల్ల తల్లిదండ్రులు ఈ అలవాటు ఉంటే వెంటనే మానిపించడం, స్పీచ్ థేరపిస్ట్ ను కలిసి మాటలు మాట్లాడే ప్రక్రియను వేగవంతం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు.

## ఐదేళ్ల లోపు చిన్నారులకు సెల్ ఫోన్లు ఇవ్వవద్దు..

పిల్లలు ఏడవకుండా ఉండేందుకు తల్లిదండ్రులు ఫోన్ లో వీడియోలు చూపిస్తుంటారు. దీంతో పిల్లలు ఏడుపు మానడానికి ఆనంద పడుకుంటారు. కానీ ప్రమాదాన్ని మాత్రం గుర్తించడం లేదు. సెల్ ఫోన్ చూపించడం వలన మాటలు ఆలస్యం అవుతాయని దాంట్లో సందేహం లేదు. తల్లిదండ్రులు మాట్లాడక, కేవలం ఆయాల సంరక్షణ, బేబీ కేర్ సెంటర్లలో ఉండడం, వారు వీడియోలు చూపించడం కారణంగా మెదడులో మాట్లాడే కణాలు అభివృద్ధి చెందక మాటలు ఆలస్యం అవుతాయి. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే స్పీచ్ థేరపి ద్వారా వారిని సాధారణస్థితికి తెస్తున్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఫోన్ చూపిస్తే ఆ పిల్లవాడు భవిష్యత్తు నాశనం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.



## ఇలా అధిగమించవచ్చు...

మార్పు అనేది తల్లిదండ్రుల నుంచే మొదలు కావాలి. మొబైల్ పై నియంత్రణ అనేది వారి నుండే ప్రారంభం అవ్వాలి. సెల్ ఫోన్ వాడడం తగ్గించాలి. అవసరం ఉంటే తప్ప ఇతర వ్యక్తులతో మాట్లాడవద్దు. అప్పుడే తల్లిదండ్రులను చూసి పిల్లలు తమ వాడకం తగ్గించుకుంటారు. అలాగే ప్రతి ఇంట్లోనూ మొబైల్ ఫ్రీ జోన్ ఏర్పాటు చేసుకోవాలి. ఉదాహరణకు బెడ్ రూమ్, డైనింగ్ లలో సెల్ ఫోన్ వాడకుండా ఉండాలి. అక్కడ తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాడవద్దు. ప్రతిరోజు కొద్ది సమయం స్క్రీన్ లేని టైం గా డిక్లేర్ చేసుకోవాలి. ఇది ప్రతి ఇంట్లోనూ ఉండాలి. వీటి ద్వారా మెల్లమెల్లగా పిల్లలు యూజెస్ తగ్గుతుంది. చిన్నపిల్లలు సెల్ ఫోన్ ను వాడితే తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి.

## సెల్ ఫోన్ ను దూరంగా ఉంచాలి...

**డా. మోతిలాల్**
**పిల్లల వైద్య నిపుణులు**



చిన్నపిల్లలు మారం చేస్తున్నారని వారి తల్లిదండ్రులు ఎక్కువగా సెల్ ఫోన్ ఇచ్చి అలవాటు చేస్తున్నారు. తద్వారా చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గజిబిజి జీవితంలో చిన్న పిల్లలు అన్నం తినడానికి మారం చేస్తే కాసేపు వారికి సెల్ ఫోన్ ను తల్లిదండ్రులు అలవాటు చేస్తున్నారు. సెల్ ఫోన్ అలవాటు చేయడం వల్ల వారి పెరుగుదలతో పాటు మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు ఏడవకుండా తల్లిదండ్రులు ఫోన్లో వీడియోలు చూపిస్తుంటారు. దీంతో పిల్లలు ఏడుపు మానడానికి ఆనంద పడుతుంటారు. కానీ ప్రమాదాన్ని గుర్తించడం లేదు. ముఖ్యంగా మానసిక సమస్య కూడా వచ్చే అవకాశం ఉంటుంది. పిల్లలకు మాటలు రావడం కూడా ఆలస్యం అవుతుందంటే సెల్ ఫోన్ లే ముఖ్య కారణం. మరి ముఖ్యంగా ఐదేళ్ల లోపు చిన్నారులకు పూర్తిగా సెల్ ఫోన్ ను దూరంగా ఉంచాలి. పిల్లల ముందు తల్లిదండ్రులు కూడా సెల్ ఫోన్ వాడకాన్ని తగ్గించుకుంటే మంచిది. పిల్లల తల్లిదండ్రులు చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఫోన్ ను దూరంగా ఉంచి సరదాగా తోటి పిల్లలతో ఆటలు ఆడేలా చూడాలి. ఏది ఏమైనా సెల్ ఫోన్ వల్ల చిన్నారులకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున వాటి నుండి దూరం చేసేందుకు తల్లిదండ్రులు సైతం శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.